సాక్షి కర్నూలు

గురువారం ౹ 4 ౹ జూలై ౹ 2024



నందీశ్వరుడికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శన గల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి పరోక్షసేవగా విశేషపూజను జరిపించారు. నాన పెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు.



సరస్వతీదేవికి పూజలు

కొత్తపల్లి: శివపురం శివారులోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి దేవి ఆలయంలో సరస్వతీదేవికి బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



9.5 టీఎంసీల నీరు

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి 10,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. బుధవారం రాత్రి 8 గంటల సమయానికి డ్యాంలో 9.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

గ్రామ పంచాయతీలకు రూ.1.38 కోట్లు

- ఇందులో సర్పంచుల గౌరవ వేతనాలకు రూ.82.25 లక్షలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీలకు రూ.1.38 కోట్లు విడుదలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందులో మొదటి విడతగా వృత్తి పన్ను కింద రూ.35,72,827, పర్‌క్యాప్టా కింద రూ.20,52,426, గ్రామ పంచాయతీ సర్పంచుల గౌరవ వేతనాలకు (నెలకు రూ.3 వేల ప్రకారం, నాలుగు నెలలకు) రూ.82,25,000 ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ నిధులను జిల్లాలోని గ్రామ పంచాయతీలకు సర్దుబాటు చేసేందుకు ట్రెజరీకి బిల్లులను పంపించామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో ట్రెజరీ నుంచి గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ అవుతాయన్నారు.

6న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఈ నెల 6న స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు గ్రామీణాభివృద్ధి, 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యవసాయం, 12 గంటల నుంచి 1 గంట వరకు సాంఘిక సంక్షేమం, 1 గంట నుంచి 2 గంటల వరకు విద్య, వైద్యం.. 2.30 నుంచి 3.30 గంటల వరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆర్థిక, ప్రణాళిక, పనులపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశాలకు సంబంధిత అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు తమకు కేటాయించిన సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా కొండయ్య

కర్నూలు: కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా డీపీ కొండయ్య నియమితులయ్యారు. అమరావతిలోని ఏసీబీ హెడ్‌క్వార్టర్ కార్యాలయంలో ఉన్న కొండయ్యను తాత్కాలిక విధుల కింద (అటాచ్‌మెంట్) నియమిస్తూ ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన యుగంధర్ బాబు బదిలీపై వెళ్లడంతో 2022 మార్చి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఒక అడిషనల్ ఎస్పీ, ఐదుగురు డీఎస్పీలకు స్థానచలనం కలుగగా, అందులో భాగంగా డీపీ కొండయ్యను కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): వెల్దుర్తి గ్రామ సచివాలయం నెంబర్-1లో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సి.రాఘవేంద్రరెడ్డిని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2న పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 22 మందికి పంపిణీ చేయాల్సిన రూ.89 వేలు తన వద్ద ఉంచుకొని సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఉదయం 8 మంది వేలిముద్రలు మాత్రమే తీసుకొని వారికి కూడా పెన్షన్ అందించకుండా సాయంత్రం వరకు ఇబ్బందులకు గురిచేశాడన్నారు. సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా సాయంత్రం అందరికీ పెన్షన్లు అందాయన్నారు. ఈ ఘటన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా డిజిటల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారని డీపీఓ తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్

కర్నూలు (సిటీ): విద్యార్థి సంఘాలు ఇస్తున్న పిలుపు మేరకు నేడు (గురువారం) విద్యాసంస్థల బంద్ చేయనున్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్‌కు సహకరించాలని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలను విద్యార్థి సంఘాలు కోరిన మేరకు ఏపీ ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ స్వచ్ఛందంగా బంద్ చేయనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవయ్య, నాగరాజులు తెలిపారు.

'స్కౌట్స్ అండ్ గైడ్స్' దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత యూనిట్ల పునరుద్ధరణ, కొత్త యూనిట్ల నమోదుకు నేటి(గురువారం)నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కాగిత శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు రిజిస్ట్రేషన్ క్లబ్/బుల్‌బుల్‌కు రూ.211, స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రూ.381, రోవర్స్ అండ్ రేంజర్స్‌కు రూ.301 ప్రకారం ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు చెల్లించి ప్రతి స్కూల్ యాజమాన్యం రసీదు పొందాలన్నారు. ప్రతి స్కూల్‌లో కచ్చితంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 9701774556 నంబరును సంప్రదించాలన్నారు.

శాంతిభద్రతల సమస్యతో జిల్లా అట్టుడుకుతున్నా పోలీసు వ్యవస్థ మీనమేషాలు లెక్కిస్తోంది. ఇప్పటి వరకు తమ చర్యలతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కంటిచూపుతో శాసించిన ముఖ్య అధికారులు ఇప్పుడు తమకెందుకులే అని మిన్నకుండిపోయారు. నామమాత్రం కేసులు మినహా ఎక్కడా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పోలీసు వ్యవస్థకే మచ్చ తీసుకొస్తోంది. అసలు ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ఏమయ్యాయనే ఆశ్చర్యం కలుగుతోంది. దాడుల సమాచారం తెలుసుకోలేకపోతున్నారా? లేక తెలిసినా తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని మిన్నకుండిపోతున్నారో తెలియని పరిస్థితి. ఈ మౌనం ఎక్కడ 'ఫ్యాక్షన్'కు పురుడు పోస్తుందోననే ఆందోళన ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది.

రాజకీయ రక్తాశ్రువులు



కొనసాగుతున్న టీడీపీ దౌర్జన్యకాండ

- కౌంటింగ్ ముగిసి నెల దాటినా ఆగని దాడులు
- వైఎస్సార్ విగ్రహాలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం
- వరుస ఘటనలను నిలువరించలేని పోలీసులు
- తమ పోస్టింగ్‌లు పోతాయేమోననే ఆందోళన
- దాడులపై స్పందించని మంత్రులు, టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి కర్నూలు: నేటితో కౌంటింగ్ ముగిసి సరిగ్గా 30 రోజులు. ఉమ్మడి జిల్లాలో 30 కంటే ఎక్కువే దౌర్జన్యకాండలు చోటు చేసుకున్నాయి. బాధితులు ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు కేసు నమోదుకే పరిమితం అవుతున్నారు. ఈ కారణంగా నిత్యం ఏదో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. అంటే తాము హత్యలు చేసినా, దాడి చేసినా, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చేసినా పోలీసులు ఏమీ చేయలేరనే ధీమా టీడీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. ఇన్ని ఘటనలు జరిగినా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఫరూక్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిలువరించకపోవడం గమనార్హం. ఇలాంటి దాడులు సమంజసం కాదని కూడా చెప్పకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. దీన్ని బట్టి చూస్తే అరాచకంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసి గ్రామాల్లో తమకు ఎదురులేకుండా చేసుకోవాలనే ప్రయత్నంగా అర్థమవుతోంది. తద్వారా భవిష్యత్తులో ఇసుక దోపిడీ, మైనింగ్, ప్రభుత్వ వనరులను దోచుకోవడం.. ఇతరత్రా అంశాల్లో తమకు ఎవరూ పోటీ రాకుండా చూసుకోవడంలో ఇదంతా ఓ భాగమనే చర్చకు తావిస్తోంది.

పోలీసులు కూడా నిస్సహాయులే..

ప్రస్తుతం పోలీసులు పోస్టింగుల కోసం ఎమ్మెల్యేలను కలుస్తున్నారు. టీడీపీకి వ్యతిరేకంగా తాము ప్రవర్తిస్తే ఎక్కడ తమకు స్టేషన్ దక్కదో అని ఎస్‌ఐలు, సర్కిల్ దక్కదోనని సీఐలు కంగారు పడుతున్నారు. చివరకు సీఐల పోస్టింగులు కూడా మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల్లో లేవని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే, మంత్రులు లెటర్లు ఇచ్చినా జాబితాను గతంలో కర్నూలు, గుంటూరు డీఐజీలుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులు ఫైనల్ చేస్తున్నారు. దీంతో తాము టీడీపీకి అనుకూలంగా లేమని ఎక్కడ వారి విచారణలో తేలుతుందో, తమకు పోస్టింగ్‌లు రావనే ఆందోళనలో పోలీసుల్లో కూడా ఉంది. చివరకు డీఎస్పీ, ఎస్పీల్లో కూడా ఈ కంగారు కనిపిస్తోంది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..



చెరుకులపాడు నారాయణరెడ్డి పత్తికొండ నియోజకవర్గంలో బలమైన నేత. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు నుంచి ఆ నియోజకవర్గంలో బలమైన విపక్షనేతగా ఉన్నారు. 2019లో నారాయణరెడ్డి గెలుపు తథ్యం అని ప్రత్యర్థులు భావించారు. 2017 మే 21న దారుణంగా హతమార్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ హత్య అప్పట్లో సంచలనం రేపింది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో చెప్పే నసాక్ష్యం ఇది.

ప్రస్తుత టీడీపీ హయాంలో:

- ఓర్వకల్లు మండలం హుస్సేనాపురంలో పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీ ఏజెంటుగా కూర్చున్నారని వెంగన్న అనే వ్యక్తిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అనుచరులు దాడి చేశారు. తల, ఛాతీపై గాయపరిచారు. అదే గ్రామంలో లోటర్ బాషా అనే వ్యక్తి టీడీపీ నేతలు తనపై దాడి చేస్తారేమోనని భయపడి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. టీడీపీ శ్రేణులు ఇంటిపై రాళ్లతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు.
- జూన్ 8న అల్లుగుండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్దమద్దన్న, మనోహర్, మోహన్‌కృష్ణ, చిన్న మారెన్నలపై టీడీపీ నాయకుడు శివ అతని అనుచరులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులకు తీవ్ర గాయాలయ్యాయి. చివరకు వీఆర్వో ప్రసాద్‌పైనా టీడీపీ నాయకులు దాడి చేశారు.

గడివేముల మండలం ఒండుట్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజర్ల రవీంద్రారెడ్డిపై టీడీపీ నేతలు ఈ నెల 2న హత్యాయత్నానికి బరితెగించారు. కర్నూలు నుంచి సొంత గ్రామానికి వెళ్తున్న ఇతనిపై కత్తులు, గొడ్డళ్లు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ హత్యాయత్నాన్ని అడ్డుకునేందుకు యత్నించిన వెంకటరమణ అనే మరో వ్యక్తిపైనా దాడి చేశారు.

పై ఘటనలు పరిశీలిస్తే 2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో హత్యా రాజకీయాలు ఎలా నడిచాయో, ఇప్పుడు తిరిగి అలాంటి భయానక వాతావరణం కళ్ల ముందు కనిపిస్తోంది.

టీడీపీ హయాంలో రక్తసిక్తం

సంవత్సరం	హత్యలు
2015	109
2016	120
2017	90
2018	91
2019	72

- పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో జూన్ 4న వైఎస్సార్‌సీపీ కార్యకర్త లోకరాజుపై ఆ గ్రామ టీడీపీ నాయకులు దాడి చేశారు. 5న ఇదే గ్రామంలో బోయ నరేష్‌పై దాడి చేశారు. దీంతో నరేష్ కుటుంబంతో సహా ఊరు వదిలి వెళ్లిపోయాడు. అలాగే వెల్దుర్తిలో మైనార్టీ నాయకులు గట్టు ఆరిఫ్, హఫీజ్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు. జూలై 2న తిరిగి ఊరికి వస్తే మళ్లీ దాడికి యత్నించగా తప్పించుకుని పారిపోయారు.



గత నెలరోజుల్లో జరిగిన ముఖ్యమైన ఘటనలు కొన్ని..



- ఓర్వకల్లు మండలం నన్నూరులో జాతీయ రహదారి పక్కన పూడిచెర్ల బస్‌స్టాప్ సమీపంలో వైఎస్సార్ విగ్రహాన్ని జూన్ 13న దుండగులు ధ్వంసం చేశారు.
- కోడుమూరు మండలం కొత్తపల్లిలో కేశవులు, చిన్నమద్దిలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు.
- తుగ్గలి మండలం దిగువ చింతలకొండలో జూన్ 15న వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులుపై శభాష్‌పురం గ్రామానికి చెందిన ముగ్గురు, డీసీ కొండకు చెందిన ఒకరు దాడి చేశారు.
- జూన్ 15న కృష్ణగిరి మండలం రామకృష్ణాపురంలో కురవ సురేశ్‌పై దాడికి యత్నించారు. బైకు వదిలి పారిపోతే బైకుకు నిప్పుపెట్టారు.
- ఎస్‌హెచ్ ఎర్రగుడిలో ఆర్‌బీకే, టి.గోకులపాడులో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన అభివృద్ధి పనులు, పంచాయతీ కార్యాలయం, సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి.
- వెల్దుర్తి మండలం చెరుకులపాడులో జూన్ 18న పాలహంద్రీపై రూ.23 కోట్లతో చేపట్టే బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భూమిపూజ చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అలాగే క్రిష్ణగిరి మండలంలోని టి.గోకులపాడు గ్రామంలో మూడు అభివృద్ధి పథకాల శిలాఫలకాలను ధ్వంసం చేశారు.
- జూన్ 19వ తేదీన పత్తికొండ మండలం హోసూరులో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు.
- జూన్ 30న కృష్ణగిరి బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహంతో పాటు రైతుభరోసా కేంద్రం శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విగ్రహం తల, చెయ్యి తొలగించారు.
- కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో జూన్ 8న అంపినేని హరికృష్ణ ఇంటికి వెళ్లి దాడి చేశారు. అడ్డొచ్చిన భార్య తిరుపతమ్మపై కూడా దాడి చేశారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.
- కొలిమిగుండ్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డె శీనుపై టీడీపీ నేతలు కట్టెలతో దాడి చేశారు.
- ఎన్నికల్లో ఏజెంటుగా కూర్చున్నారని జూన్ 14న కొలిమిగుండ్ల మండలం కల్వటాలలో శ్రీకాంత్‌రెడ్డి అనే వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి చేశారు.
- కొలిమిగుండ్ల మండల పరిధిలోని అబ్దులాపురంలో 21న బోయ లక్ష్మినాయుడిపై దాడి చేసేందుకు ఇతర గ్రామం నుంచి మూడు వాహనాల్లో రౌడీలను పిలిపించుకుని ఇంటి నుంచి లక్ష్మీనాయుడిని వీధిలో ఈడ్చుకుంటూ వెళ్లి దాడి చేశారు. అడ్డుకోబోయిన శివారెడ్డి, శంకరయ్య, రేణుక, వరలక్ష్మిలపై కూడా దాడి చేశారు.
- జూన్ 13న ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు పువ్వాడ భాస్కర్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు.

ఐఏబీ నిర్వహణకు చర్యలు

- జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమీక్షకు హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(సెంట్రల్): తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదలపై చర్చించేందుకు ఐఏబీ (ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుంగభద్ర దిగువ కాలువ, ఆలూరు బ్రాంచ్ కెనాల్, కేసీ కెనాల్, హంద్రీ-నీవా, సంజీవయ్య సాగర్(గాజులదిన్నె), వేదవతి, రోజోలిబండ డైవర్షన్ స్కీమ్, కోట్లవిజయ భాస్కరరెడ్డి బ్యారేజ్(సుంకేసుల) గురించి గూగుల్ మ్యాప్‌ల ద్వారా పరిశీలించి తెలుసుకున్నారు. ఎల్ఎల్‌సీ, కేసీ కెనాల్ ఎక్కడ ప్రారంభం అవుతాయి? ఎక్కడ ముగుస్తాయి? వాటి నుంచి జిల్లాకు వచ్చే నీరు.. తదితర విషయాలను జలవనరుల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని సాగు, తాగునీటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలపై సమగ్ర నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించారు. నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి సమస్యలు ఏమున్నాయో నివేదికలో పొందుపరచాలన్నారు. ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి లభ్యతను గుర్తించడానికి సెన్సార్ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి పథకాలను సక్రమంగా నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావును ఆదేశించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇప్పటి వరకు 1,026 పనులు పూర్తి చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

వంద శాతం పురోగతి సాధించాలి

అస్పిరేషనల్ బ్లాకుల్లో సెప్టెంబర్ 30వ తేదీనాటికి సంపూర్ణత అభియాన్‌లో వంద శాతం పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అస్పిరేషనల్ బ్లాకు ప్రోగ్రాం కింద జిల్లాలో నిర్వహించనున్న సంపూర్ణత అభియాన్‌పై అధికారులతో సమీక్షించారు. జూలై 4న హొళగుంద, 5న మద్దికెర, 6న చిప్పగిరిలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలకు సంబంధించి సభలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, యువకులతో ర్యాలీలు జరపాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ హిమప్రభాకర రాజు, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్షుమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4,475 మందికి అందని పింఛను

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెల ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను వందలాది మంది లబ్ధిదారులు పొందలేకపోయారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఐదు రోజుల పాటు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ప్రతి నెలా 99.25 నుంచి 99.50 శాతం వరకు పింఛన్ల పంపిణీ జరిగింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి రెండు రోజులే అవకాశం ఇవ్వడం, సచివాలయ ఉద్యోగులు ఇంటి దగ్గరకు వెళ్లకుండా చాలా వరకు సచివాలయాలు, రచ్చబండల దగ్గర పంపిణీ చేశారు. రెండవ తేదీతో పింఛన్ల పంపిణీ ముగిసింది. ఇందువల్ల 4,475 మంది పింఛను పొందలేకపోయారు.

- కర్నూలు జిల్లాలో 2,45,229 పింఛన్లు ఉండగా.. 98.99 శాతంతో 2,42,740 పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. 2,489 మంది పింఛను పొందలేకపోయారు.
- నంద్యాల జిల్లాలో 2,21,240 పింఛన్లు ఉండగా.. 99.01 శాతంతో 2,19,254 పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో జిల్లాలో 9వ స్థానంలో నిలిచింది. 1,986 మంది పింఛను పొందలేకపోయారు.

న్యాయవాదుల సంక్షేమ నిధి పెంపు

కర్నూలు (లీగల్): రాష్ట్ర బార్ కౌన్సిల్ నుంచి న్యాయవాదులకు అందించే సంక్షేమ నిధిని పెంచుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా తెలిపారు. గతంలో న్యాయవాద వృత్తి నిర్వహించి మృతిచెందిన న్యాయవాద కుటుంబానికి రూ.3 లక్షలు సంక్షేమ నిధి ద్వారా అందించేవారు. ఆ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి పెంచిన సంక్షేమ నిధి సహాయం అమలులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.

చెక్‌పోస్టు సెబ్ సిబ్బందిపై బదిలీ వేటు

- ఒకరు పత్తికొండకు, మరొకరు ఆలూరుకు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు: కర్నూలు శివారు పంచలింగాల అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మాబు పీరా, కానిస్టేబుల్ నరసింహులు అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారుల విచారణలో రుజువు కావడంతో బదిలీ వేటు పడింది. మాబు పీరాను పత్తికొండకు, నరసింహులును ఆలూరు సెబ్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలుకు చెందిన గిరిబాబుతో పాటు మరో నలుగురు యువకులు ఈనెల 15న అలంపూరుకు వెళ్లి మద్యం సేవించి తిరిగి వచ్చేటప్పుడు కారులో ఆరు మద్యం బాటిళ్లు తీసుకొచ్చారు. అక్కడ విధుల్లో ఉన్న మాబు పీరా, నరసింహులు వాహనం తనిఖీ చేసి మద్యం బాటిళ్లు నొక్కేసి కారును వదిలేశారు. 'చెక్‌పోస్టు ఉద్యోగం భలే కిక్కు' శీర్షికన ఈనెల 16న 'సాక్షి'లో వెలువడిన కథనానికి స్పందించి ఏఈఎస్ వినోద్‌కుమార్ చేత విచారణ జరిపించారు. చెక్‌పోస్టులో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా మద్యం నొక్కేసినట్లు ఆధారాలు బయటపడ్డాయి. దీంతో సీఐ శ్రీనివాసులును కూడా విచారించగా పొరపాటు జరిగినట్లు అంగీకరించారు. ఆ మేరకు నివేదికను అడిషనల్ ఎస్పీ నాగరాజుకు సమర్పించారు. ఆయన ఆదేశాల మేరకు ఇరువురినీ చెక్‌పోస్టు విధుల నుంచి తప్పించి బదిలీ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టుబడిన మద్యం సెబ్ సిబ్బందికి ఆదాయ వనరు

పొరుగు రాష్ట్రం నుంచి ద్విచక్ర వాహనాలు, కాలినడకన జిల్లాలోకి తరలిస్తున్న వారిని తనిఖీల పేరుతో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సెబ్ సిబ్బంది ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. కేసులు పెట్టకుండా వదిలేసి, నొక్కేసిన మద్యాన్ని తిరిగి మద్యం దుకాణానికి చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఎక్సైజ్ శాఖలో పనిచేసిన సిబ్బందే చెక్‌పోస్టు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో మామూళ్లకు అలవాటు పడిన కొందరు అక్కడ చేతివాటం ప్రదర్శిస్తూ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. భారీగా మద్యం పట్టుబడినప్పుడు మాత్రమే కేసులు పెడుతున్నారు. పది బాటిళ్ల లోపు పట్టుబడితే రవాణాదారులను వదిలేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని సమీపంలోని దుకాణానికి చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. అలంపూరు మద్యం దుకాణం వద్ద ఇద్దరు యువకులు ఇన్‌ఫార్మర్ల ముసుగులో సెబ్ సిబ్బందికి సహకరిస్తున్నారు.



పంచలింగాల సెబ్ చెక్‌పోస్టు

సీఐ, ఎస్ఐలపై కూడా గతంలో బదిలీ వేటు

చెక్‌పోస్టు విధుల్లో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలపై గతంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ జిలానీ బాషాలపై బదిలీ వేటు పడింది. 'ఆ సగం సంగతేంటి?' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనానికి స్పందించి అప్పటి ఉన్నతాధికారులు విచారణ జరిపించగా భారీగా అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ముగ్గురు ఎస్పీఓలను విధుల నుంచి డిస్మిస్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. పట్టుబడిన మద్యాన్ని మాయం చేసి ద్విచక్ర వాహనాన్ని అక్కడ విధుల్లో ఉన్న ఎస్ఐ వినియోగిస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించి అతనిపైనా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

జెడ్పీలో నలుగురికి పదోన్నతి



పదోన్నతి పొందిన వారితో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని వివిధ విభాగాల్లో జూనియర్ సహాయకులు, టైపిస్టులుగా పనిచేస్తున్న వారి అర్హతలు, సీనియారిటీ మేరకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం జెడ్పీలోని తన ఛాంబర్‌లో చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి పదోన్నతి పొందిన వారికి ఉత్తర్వు కాపీలను అందించారు. పదోన్నతి పొందిన వారిలో నొస్సం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.లాజరస్‌ను సీనియర్ సహాయకులుగా జెడ్పీకి నియమించారు. ఆళ్లగడ్డ పీఆర్‌ఐ సబ్ డివిజన్‌లో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సమతను జెడ్పీ కర్నూలుకు, కర్నూలు పీఐయు డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న వై.నాగేశ్వరరెడ్డిని బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయానికి, అవుకు ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న డి.బాబుప్రసాద్‌ను ఆళ్లగడ్డ పీఆర్‌ఐ సబ్ డివిజన్‌కు పదోన్నతిపై నియమించారు.

ఈసీజీ త్రీ చానల్ మిషన్ విరాళం



సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి నుంచి ఈసీజీ మిషన్ అందుకుంటున్న డాక్టర్ లక్ష్మీబాయి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రవాస భారతీయ వైద్యుడు డాక్టర్ చామర్తి సుబ్బారెడ్డి(కేఎంసీ 1971బ్యాచ్ విద్యార్థి) ఈసీజీ త్రీ చానల్ మిషన్‌ను విరాళంగా అందజేశారు. ఆయన ప్రస్తుతం వెస్టిండీస్ దేశంలోని జెనడలో ఉంటారు. ఇటీవల ఈసీజీ మిషన్‌ను విరాళంగా ఇచ్చిన డాక్టర్ రామ్ కొప్పర్తిని ఈయన స్ఫూర్తిగా తీసుకుని ఆసుపత్రికి ఈ సహాయం చేశారు. ఈ మిషన్‌ను బుధవారం కార్డియాలజీ ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీబాయికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఈసీజీ టెక్నీషియన్ తిరుమలరావు పాల్గొన్నారు.


నేటి నుంచి 'సంగీతం' పరీక్షలు

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో గురువారం నుంచి సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ పేర్కొన్నారు. థియరీ పరీక్షలు ఈనెల 6వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి 1 గంట వరకు, ప్రాక్టికల్ పరీక్షలు 7, 8 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఓకల్ 24, వయోలిన్ 3, నాదస్వరం 6, డోలు 5, కూచిపూడి నృత్యం 31 మొత్తం 69 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ నుంచి సత్యనారాయణ పరీక్షలు పరిశీలకులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కర్నూలు (టౌన్): తెలంగాణ రాష్ట్రం నుంచి కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఎదురూరు గ్రామంలో అక్రమంగా ప్రవేశించి ఇసుకను తరలిస్తున్న 13 ట్రాక్టర్లను మైనింగ్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను కర్నూలు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా మైనింగ్, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. తనిఖీల్లో గనుల శాఖకు చెందిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, రూరల్ సీఐ వీరయ్య, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

డెంగీ బూచి.. ఆపై దోచి!



- డెంగీ పేరుతో ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ
- ర్యాపిడ్ టెస్ట్ రిపోర్టుతోనే చికిత్స
- ఎలీసా టెస్ట్ చేయించని ఆసుపత్రులు
- పలు ల్యాబ్‌ల్లో తప్పుడు నివేదికలు!
- సాధారణ జ్వరంలోనూ తగ్గే ప్లేట్‌లెట్లు
- దీనిని సాకుగా చూపి వసూళ్లు
- ప్రతి జ్వరమూ డెంగీ కాదంటున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటితో పాటు మరో 12 ఆరోగ్య కేంద్రాలు, 28 అర్బన్‌హెల్త్ సెంటర్లు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. వీటితో పాటు 160కి పైగా రిజిస్టర్డ్ ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. ఇవి ఎక్కువగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలో ఉన్నాయి. సాధారణంగా పేదలు ఎక్కువ మంది జ్వరం వస్తే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటారు. కాస్త డబ్బున్న వారు, పనులున్న వారు మాత్రం సమీపంలోని ఆర్‌ఎంపీ లేదా ప్రైవేటు వైద్యున్ని సంప్రదిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు ఒక రోగిని తీసుకొస్తే ఆర్‌ఎంపీలకు 40 నుంచి 60 శాతం వరకు కమీషన్లు ఇస్తారు. ఇలాంటి ఆసుపత్రులు కర్నూలులోని కొత్తబస్టాండ్, ఎన్‌ఆర్ పేట, గాయత్రి ఎస్టేట్ పరిసరాల్లో అధికంగా ఉన్నాయి. వీరి వద్దకు జ్వరం ఉందని వస్తే చాలు కేవలం వైద్య పరీక్షలకే రూ.2,500 దాకా ఖర్చు చేయిస్తున్నారు. ఆ తర్వాత డెంగీ ఉందని చెప్పి ఆసుపత్రుల్లో చేరాలని చెబుతున్నారు. ఇందులో చాలా మంది రోగులు తాము మళ్లీ వస్తామని, డబ్బులు తెచ్చుకోలేదని అ క్కడి నుంచి జారుకుంటున్నారు. కొందరు డాక్టర్‌పై నమ్మకంతో పాటు భయం కారణంగా ఆసుపత్రిలో చేరుతున్నారు. వీరి బలహీనతను ఆసరాగా చేసుకున్న వైద్యులు అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రతిరోజూ రక్తపరీక్షలు, వందల రూపాయల మందులకు డబ్బులు వెచ్చించేలా చేస్తున్నారు. ఇలా వారం, పదిరోజుల పాటు ఆసుపత్రిలో ఉంచుకుని జ్వరం తగ్గాక డిశ్చార్జ్ చేస్తున్నారు.

ఎలీసా టెస్ట్‌తోనే డెంగీ నిర్ధారణ

డెంగీ పరీక్ష నిర్ధారణ కోసం మొదట ర్యాపిడ్ కిట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. అందులో డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే ఆ రోగి రక్తనమూనాలను కర్నూలు మెడికల్ కాలేజీలోని మైక్రోబయాలజి ల్యాబ్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలి. ఈ ల్యాబ్‌లకు ఇటీవల ప్రతిరోజూ 20 నుంచి 30 వరకు రక్తనమూనాలు వస్తున్నాయి. వీటిని అక్కడి వైద్యులు పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. ఇక్కడి నివేదికల ఆధారంగానే డెంగీ చికిత్స అందించాలి. ఇక్కడి టెస్ట్ ఆధారంగానే ఆరోగ్యశ్రీ కూడా వర్తిస్తుంది. కానీ అధిక శాతం ప్రైవేటు ఆసుపత్రులు కేవలం ర్యాపిడ్ కిట్‌లో వచ్చిన నివేదికల ఆధారంగా డెంగీగా చెప్పి చికిత్స చేస్తున్నారు. రక్తంలో ప్లేట్‌లెట్లు(రక్తకణాలు) తగ్గాయని చెప్పి బ్లడ్‌బ్యాంకులకు పంపి వాటిని తెప్పించి ఎక్కిస్తున్నారు.

'పులి దోమ'తో ప్రమాదం

ఏడిస్ ఈజిప్టి అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది. ఈ దోమ శరీరంపై నల్లటి, తెల్లటి చారలు ఉంటాయి. అందుకే దీనిని పులిదోమ అని కూడా పిలుస్తారు. ఈ దోమ శుభ్రమైన, నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. సూర్యోదయమైన రెండు గంటల వరకు, సూర్యాస్తమయానికి రెండు గంటల ముందు మాత్రమే ఇది కుడుతుంది. ఇది కేవలం రెండు వారాలు మాత్రమే జీవిస్తుంది. ఈ దోమ తన జీవితకాలంలో మూడుసార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ప్రతిసారీ వంద గుడ్లను పెడుతుంది. ఈ దోమలు ఇంట్లో బట్టలు, పరుపులు, కర్టన్స్ వెనుక దాక్కుంటాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- డెంగీకారక ఏడిస్ ఈజిప్టి దోమ కేవలం పగలు మాత్రమే కుడుతుంది.
- ఉదయం, సాయంత్రం వేళల్లో శరీరాన్ని పూర్తిగా కప్పుకునే దుస్తులు ధరించాలి. చిన్నపిల్లల ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలి.
- దోమతెరలు, జాలీలు వాడాలి.
- ఇంటిలో, ఇంటి ఆవరణలో నీళ్ల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో, బావులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు అమర్చాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, రబ్బరుటైర్లు, వాటర్ కూలర్లు వంటి పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి.
- డెంగీ జర్వం వస్తే తీవ్రమైన తలనొప్పి,కళ్లు, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. ఒంటిపై ఎర్రటి దురదలు కనిపిస్తాయి. ముక్కు, చిగుళ్లల్లో రక్తం ప్రవిస్తుంది. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.
- జ్వరం తగ్గేందుకు పారాసిటమాల్‌ను వైద్యుల సూచన మేరకు వాడుతూ ఉండాలి.
- ముఖ్యంగా శరీరం డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగుతూ ఉండాలి.
- సాధారణ మనిషిలో ప్లేట్‌లెట్లు 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ఉంటాయి. రక్తకణాల సంఖ్య 10 వేలలోపు ఉంటే మాత్రమే జాగ్రత్త పడి ఆసుపత్రిలో చేరాలి.

చర్యలు తీసుకుంటాం



కర్నూలు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే డెంగీ వ్యాధి నిర్ధారణకు ఎలీసా టెస్ట్ ల్యాబ్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరపీడితులకు ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ వస్తే వెంటనే ఆ వ్యక్తి రక్తాన్ని ఎలీసా టెస్ట్ కోసం పంపించాలి. ఎలీసా టెస్ట్‌లో డెంగీ నిర్ధారణ అయితేనే చికిత్స చేయాలి. వాస్తవంగా ఈ వ్యాధికి ప్రత్యేకంగా చికిత్స లేదు. లక్షణాలను బట్టి వైద్యులు చికిత్స చేస్తారు. కొందరు వైద్యులు, ప్రైవేటు ఆసుపత్రుల వారు డెంగీ పేరుతో రోగుల నుంచి అధికంగా డబ్బులు గుంజేందుకు ర్యాపిడ్ టెస్ట్‌నే డెంగీగా చెప్పి చికిత్స చేస్తున్నట్లు మాకు సమాచారం వస్తోంది. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

- కర్నూలుకు చెందిన శివశంకర్‌రెడ్డి ఎగ్జిక్యూటివ్ జాబ్ చేస్తుంటాడు. 45 ఏళ్ల అతనికి ఇటీవల జ్వరం వచ్చింది. సాధారణ జ్వరమేనని మెడికల్ షాపులో మాత్రలు తెచ్చుకుని వేసుకున్నాడు. మూడు రోజులైనా తగ్గకపోవడంతో ఎన్‌ఆర్ పేటలోని ఓ వైద్యుని వద్దకు వెళ్లాడు. జ్వరం అని చెప్పగానే డెంగీతో పాటు మలేరియా, టైఫాయిడ్, సీబీపీ పరీక్షలన్నీ చేయించారు. మూడు జ్వరాలు నిర్ధారణ కాకపోయినా సీబీపీలో ప్లేట్‌లెట్లు తగ్గాయని డెంగీగా అనుమానం ఉందని చెప్పారు. ఈ మేరకు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పి వారం రోజులు ఉరిచి రూ.40వేల దాకా ఖర్చు చేయించారు.
- కల్లూరుకు చెందిన రవికుమార్‌కు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీని కలిశాడు. అతను పరీక్షించి గాయత్రి ఎస్టేట్‌లోని ఓ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షించి డెంగీగా అనుమానం ఉందని అడ్మిట్ కావాలని సూచించారు. భయపడిన రవికుమార్ దానికి ఒప్పుకున్నాడు. వారం రోజులు ఆసుపత్రిలో ఉన్న అతనికి ప్రతిరోజూ రక్త పరీక్ష చేసి ప్లేట్‌లెట్ల సంఖ్యను చెప్పేవారు. దాంతో అతనిలో కలవరం మొదలైంది. మొదటి మూడు రోజులు తగ్గినట్లు చూపి, ఆ తర్వాత రోజురోజుకూ పెరిగినట్లు చూపించారు. వారం తర్వాత రూ.45వేలు ఖర్చు చేయించి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.
- వీరే కాదు సాధారణ జ్వరంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రికి వెళితే డెంగీ లక్షణాలున్నాయని కొందరు వైద్యులు భయపెడుతున్నారు. ర్యాపిడ్ టెస్ట్ చేయించి డెంగీగా పేర్కొంటూ ఆసుపత్రిలో చేర్చుకుని రోగులకు చికిత్స చేస్తున్నారు. కర్నూలులోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక శాతం ఇప్పుడు ఇదే వ్యాపారంగా మారింది. దీనికి ఆర్‌ఎంపీలు తోడు కావడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు...ఆరు కాయలుగా నడుస్తోంది.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె..!

- ప్రారంభమైన ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ
- ఈనెల 7 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- 10 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 13న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం
- 16న సీట్లు కేటాయింపు

నంద్యాల(న్యూటౌన్)/కర్నూలు(సిటీ): ఈఏపీ సెట్ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ నోటిఫికేషను ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 1 నుంచి 22 వరకు కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించింది. 7 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, 10 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్,12 వరకు వెబ్ ఆప్షన్లు, 13న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుంది. 16న సీట్లు కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ మధ్యలో విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలలతో పాటు కోర్సుల ఎంపికలో నిమగ్నమయ్యారు.

ఇంజినీరింగ్‌లో సీఎస్‌ఈదే పైచేయి

ఇంజినీరింగ్‌లో ఎక్కువ శాతం విద్యార్థులు సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ కోర్సుల్లో చేరేందుకు ఇష్టపడుతున్నారు. వీటిల్లో సీఎస్‌ఈ బ్రాంచ్‌కు యమా క్రేజ్ ఉంటుంది. ఈ గ్రూపునకే విద్యార్థులు తొలి ప్రాధాన్యమిస్తారు. ఐటీ కొలువులకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు ఉండటమే ఇందుకు కారణం. రెండవ ప్రాధాన్యత ఈసీఈ బ్రాంచ్‌కు ఉంటుంది. ఈ కోర్సుతో ఎలక్ట్రికల్ పరికరాలు, అన్‌లాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్, శాటిలైన్ కమ్యూనికేషన్, మైక్రోవేవ్ ఇంజనీరింగ్, మైక్రోప్రాసెస్‌తో పాటు పలు అంశాలపై బోధనలు ఉంటాయి, కోర్ సెక్టార్ తోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలోను కొలువులకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఈ కోర్సుకు కూడా మంచి డిమాండ్ ఉంటుంది, ఇక మూడోది సివిల్ బ్రాంచి. ఈ సివిల్ కోర్సులో నిర్మాణ రంగంలో ఉద్యోగాలతో పాటు సొంతంగా కన్సెల్టెన్సీలు ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందవచ్చు. అలాగే మెకానికల్ ఇంజినీరింగ్‌కు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. అలాగే ఆటోమొబైల్స్, ఎలక్ట్రికల్ మెటార్లు రంగంలో రాణించడంతో ఈ గ్రూపుకు కూడా మంచి డిమాండే ఉటుంది.

అందుబాటులో కొత్త బ్రాంచ్‌లు

జిల్లాలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్సీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతో పాటు కొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. సీఎస్‌ఈలో ఏఐ,మెషిన్ లర్నింగ్, సైన్సు రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేర్, మెరైన్, మైనింగ్ వంటి కొత్త బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి.మంచి ర్యాంకులు వచ్చిన చాలా మంది విద్యార్థులు ఫస్ట్ ఆప్షన్ కింద సీఎస్సీ గ్రూపుల్లో చేరేందుకు ఆసక్తి కనబరచగా రెండవ ఆప్షన్ కింద ఈసీఈలో చేరేందుకు ఆసక్తి చూపుతారు.

జిల్లాలో కళాశాలల వివరాలు...

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇప్పటికే వారికి వచ్చిన ర్యాంకులు బట్టి ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలి. ఏ కళాశాల చేరాలో వంటి అంశాలపై విద్యార్థులు అవగాహనకు వచ్చి ఉంటారు. జిల్లాలోని నంద్యాల పట్టణంలో 3 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా ఇందులో ఆర్‌జీఎం కళాశాలలో 1,700, శాంతిరాంలో 420, ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 660 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా ఈ ఏడాది ఇంకా కొన్ని సీట్ల సంఖ్యను పెంచినట్లు తెలిసింది.

ఇవి చూసుకోవాలి..

విద్యార్థులు కళాశాలల్లో చేరేముందు నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపులు ఉన్నాయా లేదా గమనించాలి. దీంతో పాటు ప్రవేశాలు, ప్లేస్‌మెంట్ ఎలా ఉన్నాయనే విషయాలను ఆరా తీయడం మంచిది. కళాశాల మీద అవగాహన లేకుండా చేరడం వల్ల భవిష్యత్తులో ఇబ్బంది పడే అవకాశం ఉంది. బ్రాంచ్ కంటే కూడా కళాశాల ఎంపికే కీలకమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా..

- cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈఏపీ సెట్–24 అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి.
- వచ్చిన రిజిస్ట్రేషన్ ఫారంతో హాల్ టికెట్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించాలి. అందులో సమాచారం నింపి సబ్ మిట్ చేయాలి.
- 10వ తరగతి, ఇంటర్మీడియెట్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ర్యాంకు కార్డు, హాల్ టికెట్, రేషన్ కార్డు జిరాక్స్ అప్ లోడ్ చేయాలి.
- గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్నవారికి 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు.
- ఈ నెల 1 నుంచి జూలై 7 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు.
- ఇందులో వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.600 ఫీజును ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డు, లేదా డెబిట్ కార్డు, నెట్ బ్యాంకు ద్వారా చెల్లించాలి.
- ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరుగుతుంది.

8 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 13వ తేదీ వెబ్ ఆప్షన్లు మార్పునకు అవకాశం. 16న సీట్లు కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ మధ్యలో కళాశాలల్లో రిపోర్టింగ్.

- 17వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం

ట్రిపుల్ ఐటీడీఎంలో సర్టిఫికెట్ కోర్సు

కర్నూలు సిటీ: నగర శివారులోని జగన్నాథగట్టులో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన మ్యాన్‌ఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీడీఎం)లో బుధవారం సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ట్రిపుల్‌డీ డీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, రిజిస్ట్రార్ గురుమూర్తి హాజరయ్యారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలితో కలిసి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించినట్లు చెప్పారు. ఆరు నెలల పాటు కోర్సు ఉంటుందని, ఎంపికైన విద్యార్థులు ట్రిపుల్ ఐడీ డీఎం ప్రొఫెసర్ల సహకారం తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీఎల్ఎస్ సోమయాజులు, డాక్టర్ రంగబాబు, డాక్టర్ సత్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రాలయం మండలం ఖగ్గల్ క్రాస్ రోడ్డు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా కోసిగి మండలం బెళగల్‌కు చెందిన డి. తిరుమలేష్ వద్ద పది బాక్సుల్లో 960 టెట్రా ప్యాకెట్లు కనిపించాయని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 85,000 ఉంటుందని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. కర్ణాటక మద్యం విక్రయించినా, అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నంబర్ 9440902579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, రబ్బానీ, కానిస్టేబుళ్లు భరత్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రవికుమార్

నందికొట్కూరు రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. బ్రాహ్మణకొట్కూరు ఎస్.ఐ నాగార్జున తెలిపిన వివరాలు.. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన రవికుమార్(35) మంగళవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి కర్నూలు వైపు బయలుదేరాడు. కర్నూలు –1 డిపో ఆర్టీసీ బస్సు బ్రాహ్మణకొట్కూరు సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహన దారుడు రవికుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తులు మృతి



గుర్తుతెలియని మృతదేహాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని మూలసాగం సమీపంలో 55, 35 ఏళ్ల వయస్సున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఎస్ఐ జలీల్ తెలిపిన వివరాలు.. రెండు మృతదేహాలు పడి ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఇద్దరు అధికారుల ఇంక్రిమెంట్ల నిలిపివేత

కర్నూలు(సెంట్రల్): కృష్ణా జిల్లా గన్నవరంలో భూముల రికార్డుల సృష్టి, రిజిస్ట్రేషన్ల వివాదంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ల ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ ఉప లోకాయుక్త పి.రజనీ తీర్పు ఇచ్చారు. గన్నవరానికి చెందిన మాజీ సైనికుడు ముప్పనేని రవికుమార్ 2016లో అప్పటి గన్నవరం తహసీల్దార్ ములుగు మాధురి, సబ్ రిజిస్ట్రార్ బి.సాయి కృష్ణారెడ్డిలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విచారణ చేయాలని 2018లో లోకాయుక్త అప్పటి కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ నివేదికను ఇటీవల సీసీఎల్‌ఏ కమిషనర్ లోకాయుక్తకు సమర్పించారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ సాయి కృష్ణారెడ్డిపై స్టాంప్స్అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విచారణ చేసి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తేలింది. ఈ నివేదికను ఇటీవల లోకాయుక్తకు సమర్పించారు. ఈనేపథ్యంలో వాటిపై బుధవారం ఉపలోకాయుక్త పి.రజనీ విచారణ జరిపారు. ఇద్దరు అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో తహసీల్దార్ మాధురికి సంబంధించి రెండు ఇంక్రిమెంట్లను నిలిపి వేయాలని ఆదేశించారు. అలాగే సబ్ రిజిస్ట్రార్‌కు సంబంధించి ఒక ఇంక్రిమెంట్‌ను నిలుపుదల చేస్తూ తీర్పు ఇచ్చారు.

మరో కేసులో ఇంక్రిమెంట్ నిలుపుదల, పెన్షన్‌లో కోత

2012 సంవత్సరంలో ఒంగోలు మునిసిపాలిటీలో భవనాల అనుమతులకు అప్పటి టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీస్ ఎం.నారాయణరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీఓ) పి.శేషాచార్యులు అవినీతి, అక్రమాలకు పాల్పడనట్లు నిర్ధారణ కావడంతో ఉపలోకాయుక్త పి.రజనీ వారి ఇంక్రిమెంట్, పెన్షన్‌లో కోత విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతి చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పాణ్యం రైల్వేస్టేషన్ సమీపంలోని గాలేరునగరి కాల్వ వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాచిగూడ నుంచి గుంటూరుకు వెళ్లే రైలులో ఖమ్మంకు చెందిన కె. సునీల్‌కుమార్‌రెడ్డి(23)అనే యువకుడు ప్రయాణిస్తున్నారు. బుధవారం ఉదయం పాణ్యం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పరిశీలించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చిప్పగిరి మండలం నంచర్లలో వర్షంలేక వాడిపోతున్న కందిపైరు



మట్టిలో కలుస్తున్న ఆశలు!

ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా కురిసిన వర్షాలు తర్వాత మందగించాయి. అరకొర పదునుతో సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టాయి. చిప్పగిరి మండలంలో వర్షాధారంపై కంది, వేరుశనగ, కొర్ర, సజ్జ తదితర పంటలను సాగు చేశారు. పైరు మొలక వచ్చిన తర్వాత రెండు వారాలుగా వాన లేదు. వరుణుడు కరుణించకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయి. మరో వారం రోజులు పరిస్థితి ఇలానే కొనసాగితే వేసిన పంటలు మొత్తం ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. – చిప్పగిరి

పక్షం రోజుల్లో పరిశీలన పూర్తి కావాలి

- వీఆర్వోలను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన పరిశీలనను పక్షం రోజుల్లో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వీఆర్వోలను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను తహసీల్దార్లు పరిశీలించి ఆమోదించాలన్నారు. బుధవారం ఉదయం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు, వీఆర్వోలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..మీసేవ, రెవెన్యూ సర్వీసెస్‌లకు సంబంధించిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఒక్కో వీఆర్వో ప్రతీరోజూ 40 కులధ్రువీకరణ పత్రాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. కులధ్రువీకరణ పత్రాల కోసం జిల్లాలో 2,29,685 దరఖాస్తులు వచ్చాయని, అందులో 70,604 పరిశీలన పూర్తయిందని, మిగిలిన 1,59,081 త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులను నిర్దేశించిన సమయంలో అందించాలన్నారు. ఏదైనా కారణంతో వాహనాలు ప్రజల దగ్గరకు వెళ్లకపోతే ఆ బాధ్యతలను ఇతరులకు అప్పగించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి, డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాదు, సర్వే ఏడీ మునికన్నన్ పాల్గొన్నారు.